సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 4 । మే । 2025



దాహార్తి తీరేదెలా?

అటవీ ప్రాంతాలలోని సాసర్ పిట్లలో నీటిని నింపడం లేదు. దీంతో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి జనావాసాల్లోకి వస్తున్నాయి.

- IIIలో ▸



పేదలకు వరం కల్యాణలక్ష్మి

పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
43.5 /21.7

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ శాతం తగ్గుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

6న జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ టెక్ బీ ప్రోగ్రాంలో భాగంగా ఈనెల 6న కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 6న ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, వొకేషనల్ కంప్యూటర్ కోర్సుల్లో 75 శాతం మార్కులు, గణితంలో 60 శాతం మార్కులు పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 80740 65803, 79818 34205 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫీడర్ బ్రేకర్ ప్రారంభం




లింగంపేట: ముంబోజీపేట సబ్‌స్టేషన్‌లో శనివారం కొత్త ఫీడర్ బ్రేకర్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫీడర్ బ్రేకర్ వల్ల ముంబోజీపేట, కంచుమల్ గ్రామాలకు 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి వీలుంటుందన్నారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చూస్తూ ట్రాన్స్‌కో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఈ విజయసారథి, ఏడీఈ మల్లేష్, ఇన్‌చార్జి ఏఈ అశోక్, ఎల్ఎం పాండు, ఏఎల్ఎంలు ధర్మరాజు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్, నరేశ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు బ్రాహ్మణపల్లికి చెందిన పూజిత, వైష్ణవి, పూజ చక్కటి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. దీంతో వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 24 నుంచి 29 వరకు బిహార్ రాష్ట్రంలో నిర్వహించే ఖేలో ఇండియా జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పూజిత, వైష్ణవి, పూజ పాల్గొంటారని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



మద్నూర్: సలాబత్‌పూర్‌లో ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు, నూతన వధూవరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహరాజ్ ఆధ్వర్యంలో పూజాదులు కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నీట్ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం నీట్(యూజీ) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుంది. జిల్లాలో 3,398 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరికోసం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించనున్నారు. ఆ తర్వాత వచ్చేవారిని అనుమతించరు.

పరీక్ష కేంద్రాలు..

నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గోల్ హనుమాన్ సమీపంలోని కస్బాగల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నాగారంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిల్డింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కళాశాల బిల్డింగ్.



జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరుగుతోంది. ఆలస్యంగా తూకాలు ప్రారంభమైనా.. ఇప్పటికే 2.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరం పరిశీలిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూస్తున్నామని పేర్కొంటున్నారు.

– కామారెడ్డి క్రైం

కొనుగోళ్ల జోరు

- ఇప్పటికే 2.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- సకాలంలో కొనుగోళ్లు పూర్తి చేస్తామంటున్న అధికారులు

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 2,61,110 ఎకరాల్లో వరి సాగయ్యింది. ఇందులో దొడ్డు రకాలు 2,03,665 ఎకరాలలో సాగవ్వగా.. సన్నరకాలు 57,445 ఎకరాల్లో సాగయ్యాయి. జిల్లాలో 4.88 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.32 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేశారు. ఇందులోనుంచి రైతుల ఇంటి అవసరాలు, ఇతర అవసరాలకుపోను కొనుగోలు కేంద్రాలకు 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వస్తుందన్న అంచనాలతో కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లు చేశారు. గతనెల మొదటి వారంలోనే జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలోని బాన్సువాడ డివిజన్ పరిధిలో వరి నాట్లు ముందుగా పడతాయి. కాబట్టి ఈ ప్రాంతంలో వరి కోతలు ముందుగా ప్రారంభం అయ్యాయి. ఈ డివిజన్‌లోనే మొదట కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లా అంతటా కేంద్రాలు ప్రారంభమై ధాన్యం సేకరణ జోరందుకుంది. సివిల్ సప్లై, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, సిబ్బంది ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి 2,06,750 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.310 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

446 కొనుగోలు కేంద్రాలు..

ఈసారి యాసంగిలో పండిన వరి ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 383 సింగిల్ విండోల ఆధ్వర్యంలో, 63 ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో 63 కేంద్రాలను కేవలం సన్న రకం ధాన్యం కొనుగోళ్ల కోసమే కేటాయించారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రేడ్- ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరను చెల్లిస్తూ రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నారు. మొత్తం 1.40 కోట్ల గన్నీ సంచులు అవసరం ఉండగా ఎప్పటి వరకు 77 లక్షలు కేంద్రాలకు చేరాయి. మరో 20 లక్షల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయి. 2023-24 యాసంగిలో 350 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం 3,17,181 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. గత యాసంగితో పోలిస్తే ఈసారి ధాన్యం సేకరణ పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అకాల వర్షాలు కురియకపోతే మరో 20 రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు.

వెంటవెంటనే జమ చేస్తున్నాం



జిల్లావ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈసారి యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు రావచ్చని భావిస్తున్నాం. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం. ట్యాబ్ ఎంట్రీ, హమాలీ, రవాణా విషయాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో డబ్బులు వెంటనే జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోళ్ల ప్రక్రియను సకాలంలో పూర్తి చేస్తాం.

– రాజేందర్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి



జిల్లాకేంద్రంలోని ఓ వైన్‌షాప్ వద్ద రద్దీ.. ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

నిబంధనలు బేఖాతరు!

పోలీసుల పెట్రోలింగ్ పెరగడంతో మందుబాబులు అడ్డాలు మార్చారు. కల్లు దుకాణాలలో మద్యం సేవిస్తున్నారు. పర్మిట్ రూంలనూ వినియోగించుకుంటున్నారు. అయితే పర్మిట్ రూంల నిర్వహణ విషయంలో పలు వైన్‌షాప్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. శనివారం ‘సాక్షి’ ఫోకస్‌లో ఈ విషయం స్పష్టమైంది.

– కామారెడ్డి క్రైం

- ఇష్టారాజ్యంగా పర్మిట్ రూంల నిర్వహణ
- కల్లు దుకాణాలలో మద్యం సిట్టింగ్
- వైన్‌షాప్‌ల వద్ద అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

SAKSHI FOCUS సాక్షి ఫోకస్

బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా కొందరు ఆకతాయిలు మద్యం సేవించే పరిస్థితులు గతంలో కనిపించేవి. ఇటీవలి కాలంలో జిల్లాలో పోలీసుల తనిఖీలు పెరగడంతో బహిరంగ మద్యపానం కొంతవరకు తగ్గింది. పోలీస్ పెట్రోలింగ్ పెరగడంతో మందుబాబులు అడ్డాలు మార్చారు. ఇటీవల వైన్‌షాప్‌ల పక్కన ఉండే పర్మిట్ రూంలే ప్రధాన అడ్డాలుగా మారాయి. అయితే వాటి నిర్వహణ విషయంలో వైన్‌షాప్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. పర్మిట్ రూం పరిమాణం, విక్రయించే ఆహారం, కల్పించే సౌకర్యాల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



దేవునిపల్లిలోని కల్లు దుకాణంలో మద్యం సేవిస్తున్న దృశ్యం

కల్లు దుకాణాల్లో..

కామారెడ్డిలోని కల్లు దుకాణాలను మద్యం ప్రియులు అడ్డాలుగా చేసుకున్నారు. మద్యం బాటిళ్లు తీసుకుని వచ్చి కల్లు దుకాణాలలో తాగుతున్నా నిర్వాహకులు సైతం అడ్డుచెప్పడం లేదు. మద్యం తాగిన తర్వాత కల్లు కూడా సేవిస్తుండడమే ఇందుకు కారణం. దీంతో పలువురు మత్తు ఎక్కువై రోడ్ల వెంబడి పడిపోతున్నారు. కొన్నిసార్లు న్యూసెన్స్ చేస్తున్నారు. బస్టాండ్, ప్రధాన కూడళ్లకు దగ్గరగా ఉండే కల్లు దుకాణాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కల్లు దుకాణాల్లో మద్యపానానికి అనుమతించవద్దని ప్రజలు కోరుతున్నారు.

‘ప్రాణహిత –చేవెళ్ల’ పూర్తి చేస్తాం



దివంగత వైఎస్సార్‌తో ఉన్న ఫొటోలను చూపుతున్న షబ్బీర్ అలీ

- 22వ ప్యాకేజీకి రూ. 23.15 కోట్ల నిధులు వచ్చాయి
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: తన ప్రాణమైన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కాళేశ్వరం పనులపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రూ. 1,400 కోట్ల అంచనా వ్యయంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కామారెడ్డిలో ఈ పథకం పైలాన్‌కు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతనెల 14న జలసౌధలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జరిగిన సమావేశంలో ప్రాజెక్ట పనులపై చర్చించామన్నారు. కామారెడ్డి ప్రాంతానికి నీరందించే 22 ప్యాకేజీకి రూ. 23.15 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వారం రోజుల్లో తిమ్మక్‌పల్లిలో పనులు మొదలుపెట్టి రెండో విడత భూసేకరణ మొదలు పెడతామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో 316 ఎకరాల భూ సేకరణ చేపట్టి 619 మంది రైతులకు పరిహారం అందిస్తామని, కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లిస్తామని పేర్కొన్నారు. మరో రూ. 200 కోట్లకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో నిధులు మంజూరవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నిత్యం తాగునీటి సరఫరా..

కామారెడ్డి బల్దియాలో ప్రస్తుతం 3 ఎంఎల్‌డీ తాగు నీరు సరఫరా అవుతున్నాయని, ఇకపై నిరంతరాయంగా నీటిని సరఫరా చేయడానికి 10 ఎంఎల్‌డీ నీటిని అందిస్తామని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా కొత్తగా 7,200 ఉచిత నల్లా కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. కామారెడ్డి ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన తాగు, సాగు నీరు అందించిన తర్వాతే తుది శ్వాస విడుస్తానన్నారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా చిన్నమల్లారెడ్డిలో ముగ్గురు దళితుల ఇళ్లను పరిశీలించారని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.

సమస్యలున్నా చక్కటి ఫలితాలు

- సత్తా చాటిన దోమకొండ మండల పదో తరగతి విద్యార్థులు
- విద్యాసంస్థలన్నింటిలోనూ వందశాతం ఉత్తీర్ణత

దోమకొండ: మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు జిల్లాకు ఆదర్శంగా నిలిచాయి. పదో తరగతిలో ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో వందశాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. మండలంలో ఉన్న రెండు ప్రైవేట్ స్కూళ్లలోనూ అందరూ పాసయ్యారు. మండలంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతోపాటు రెండు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 457 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. అందరూ ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సరైన వసతులు లేవు. కొన్ని పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు లేవు. అసౌకర్యాల మధ్య చదువుకున్నా.. దాని ప్రభావం ఫలితాలపై కనిపించలేదు. అందరు విద్యార్థులు ఉత్తీర్ణులై మండలానికి వన్నె తెచ్చారు. అన్ని పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవడంతో జిల్లాలో ఉత్తీర్ణతలో దోమకొండ మండలం మొదటి స్థానంలో నిలిచింది.



దోమకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

మండలంలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత వివరాలు..

పాఠశాల	విద్యార్థులు	ఉత్తీర్ణులు
దోమకొండ (బాలురు)	63	63
దోమకొండ (బాలికలు)	70	70
పలుగుగడ్డ	28	28
అంబారిపేట	40	40
ముత్యంపేట	43	43
సంఘమేశ్వర్	23	23
సాంఘిక సంక్షేమ	80	80
కేజీబీవీ	38	38
అభ్యుదయ	57	57
త్రివేణి	15	15

ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు



మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. రోజూ సబ్జెక్టుల వారీగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి చదువుకునేలా ప్రోత్సహించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు నమోదయ్యాయి. విద్యార్థులు, ఉపాధ్యాయల కృషి వల్ల మండలం ఉత్తమ ఫలితాలతో జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది.

– విజయ్‌కుమార్, ఎంఈవో, దోమకొండ

పూర్తి వివరాలు సేకరించాలి

లింగంపేట: భూభారతి చట్ట ప్రకారం భూ సర్వే చేసి పూర్తి వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కన్నాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామ శివారులోని 240 సర్వే నంబర్‌లో ఉన్న భూమి వివరాలు, పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. ఆ సర్వే నంబర్‌లో సాగు చేస్తున్న భూముల వివరాలు, ఎన్ని సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నారు.

భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న రైతుల సంఖ్య తదితర వివరాలను తెలుసుకున్నారు. అటవీ ప్రాంతమా లేక పట్టా భూమా అనే వివరాలు అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని సూచించారు. చట్టం ప్రకారం భూముల వివరాలు సేకరించి ఎలాంటి సమస్యలకు తావులేనట్లయితే పట్టాలకు సిఫారసు చేయాలని ఆదేశించారు. అనంతరం పర్మళ్ల గ్రామంలోని రైతు వేదికలో రికార్డులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కన్నాపూర్ శివారులో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



ర్యాలీలో పాల్గొన్న ఆర్షగురుకులం ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని పాతరాజంపేటలోని ఆర్షగురుకులం అధిపతి బ్రహ్మానంద సరస్వతి పేర్కొన్నారు. ఆర్షగురుకులంలో యువ నిర్మాణ శిబిరం నిర్వహిస్తున్నారు. యువతను చైతన్యం చేయడం కోసం శనివారం శిక్షార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ యువత అన్ని విద్యల్లో ఆరితేరాలన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రతినిధులు హరిదాస్ ఆర్య, వేదార్థి ఆర్య, అర్వపల్లి రమేష్, వేదమిత్ర, సత్యమిత్ర, బాజన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



రాష్ట్ర ఉత్తమ ర్యాంకర్ అంచితను సన్మానిస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన జిల్లా విద్యార్థులను సన్మానించి వారికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: పట్టణంలో ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ పరిధిలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు



ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్న దృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నాగిరెడ్డిపేట ఫారెస్ట్‌రేంజ్ అధికారులు తగుచర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా రేంజ్‌పరిధిలోని ధర్మారెడ్డి బీట్ ఏరియా అటవీప్రాంతంలో ఉన్న సాసర్ పిట్‌లలో ఫారెస్ట్ అధికారులు నీటిని నింపారు. గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా అటవీ ప్రాంతంలోని సాసర్‌పిట్‌లలో నీటిని నింపి వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తున్నారు.

క్షుద్రపూజల కలకలం

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని గౌలిగూడలో క్షుద్ర పూజలు కలకలం రేపింది. గౌలిగూడకు చెందిన గొల్ల రుక్మిణి ఇంట్లో పెద్ద గోతి తవ్వి అందులో కొబ్బరి కాయలు. నిమ్మ కాయలు వేస్తుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి గుంతను పూడ్చివేయించి రుక్మిణిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.. రుక్మిణితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు.

బాన్సువాడలో డ్రెయినేజీలు అధ్వానం

- మురికి కాలువల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- రోజుల తరబడి తొలగించని పారిశుద్ధ్య సిబ్బంది
- దుర్వాసనతోపాటు దోమల బెడదతో ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

బాన్సువాడ: బాన్సువాడ బల్దియాలో అనేక సమస్యలు నెలకొన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగునీటి పారుదల కాలువల్లో పూడిక, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి పూడిక తీయకపోవడంతో మురుగునీరు సరిగా ప్రవహించక ఎక్కడిక్కడ నిలిచిపోతున్నది. చెత్తాచెదారం కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నదని, దోమల బెడద విపరీతంగా పెరిగిపోతున్నది స్థానికులు వాపోతున్నారు. బాన్సువాడలో ఎన్‌జీవోస్ కాలనీ, శ్రీరామకాలనీ, చైతన్య కాలనీ, బీసీ కాలనీ, పోలీస్‌స్టేషన్ వెనుకాల కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన, ఇస్లాంపూర, మిస్త్రీ గల్లీలో ఉన్న డ్రెయినేజీలపై పూర్తి స్థాయిలో కప్పులు ఉండడం, వ్యాపారాలు కూడా ఇక్కడ అత్యధికంగా ఉండడంతో చెత్తాచెదారం ఎక్కువగా జమ అవుతోంది. తినుబండారాలు, ప్లాస్టిక్ బాటిళ్లు అందులోనే పడేయడంతో డ్రెయినేజీ అంతా నిండిపోతోంది. వర్షాకాలం ఈ కాలనీలు చెరువులను తలపిస్తాయి. పైకప్పులు పూర్తి స్థాయిలో వేసి ఎక్కడో ఓ చోట చిన్నగా వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలపై పూర్తి స్థాయిలో కప్పు వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, నిత్యం డ్రెయినేజీలు చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎన్‌జీవోస్ కాలనీలో..



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు డ్రెయినేజీ దుస్థితి



ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహాల పక్కన ఉన్న డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

చెత్తను తొలగించడం లేదు



పాత బాన్సువాడలో నెలలు తరబడి డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వస్తువులు నిండి మురికినీరు వెళ్లడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. చాలా సార్లు మున్సిపాలిటీలో చెప్పినా పట్టించుకోవడం లేదు. మురికినీరు నిల్వ ఉండడంతో దోమలు వస్తున్నాయి. వారం రోజులకు ఒకసారి డ్రెయినేజీని శుభ్రం చేస్తే బాగుంటుంది.

– సాయిలు, బాన్సువాడ

లక్ష్యంపై నిర్లక్ష్యం

- తెల్గాపూర్ జీపీ నర్సరీలో కనిపించని మొక్కల జాడ
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్ జీపీ వన నర్సరీలో మొక్కల సరఫరా లేక ఖాళీ బెడ్లు దర్శనమిస్తున్నాయి. ప్రతీ జీపీలో నాలుగు వేల మొక్కలు పెంచాలని ప్రభుత్వం ఈజీఎస్ అధికారులకు లక్ష్యం నిర్దేశించింది. అయితే జీపీల్లో వన నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకంపై ఈజీఎస్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. వన నర్సరీల్లో మొక్కల ఉత్పత్తి కోసం బెడ్లు సిద్ధం చేసినా మొక్కల జాడ కరువైంది. మరో రెండు, మూడు నెలల్లో మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటికే మొక్కల జాడ కరువైంది. అధికారులు ఇకనైనా స్పందించి వన నర్సరీల్లో మొక్కల ఉత్పత్తిపై తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మొక్కలు లేని బెడ్‌లు

ఆగిన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

- గంటపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డ వినియోగదారులు
- లైన్లను పునరుద్ధరించిన అధికారులు

నిజామాబాద్ రూరల్: బీఎస్ఎన్ఎల్ (భారతీయ సంచార్ నిగం లిమిటెడ్) సేవలకు శనివారం సాయంత్రం దాదాపు గంటపాటు అంతరాయం కలిగింది. దీంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు నెట్‌వర్క్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిజామాబాద్ జిల్లాతోపాటు ఆదిలాబాద్ జిల్లాలో అటు ఫోన్లు కలవక, ఇటు నెట్‌లేక ఫోన్‌పే, గూగుల్‌పే పనిచేయక నానా ఇక్కట్లు పడ్డారు. జిల్లా కేంద్రంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుంచి సిగ్నల్స్ రావడం లేదని గుర్తించిన వినియోగదారులు అధికారులను వివరణ కోరగా గంట రెండు గంటల్లో లైన్లను పునరుద్దరిస్తామని తెలిపారు. తిరిగి గంట సేపటికి సిగ్నల్స్ అందించారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో బీఎస్ఎన్ఎల్ లైన్ డ్యామేజ్ వల్ల ఈ సమస్య ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాకేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం



అంతరాయం లేకుండా సేవలు అందించాలి

జిల్లా కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సేవలు సాయంకాలం గంటపాటు ఆగిపోయాయి. ఫోన్ కాల్స్ రాక, గూగుల్ పే, ఫోన్ పే పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆన్‌లైన్ ట్రాన్షక్షన్స్ నిలిచి పోవడంతో వ్యాపారులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సేవల్లో అంతరాయం కలుగకుండ తగిన చర్యలు చేపట్టాలి.

–గోపి, బీఎస్ఎన్ఎల్ వినియోగదారుడు, నిజామాబాద్

40 నిమిషాలు ఆగాయి..


నిజామాబాద్ జిల్లాతోపాటు ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 40 నిమిషాలు బీఎస్ఎన్ఎల్ మొబైల్ సేవలకు అంతరాయం కలిగింది. కరీంనగర్ జిల్లా లైనింగ్ సమస్య వల్ల రెండు జిల్లాల్లో సేవలు ఆగిపోయాయి. మా సిబ్బంది వెంటనే స్పందించి లైన్లను పునరుద్ధరించడంతో వినియోగదారులకు మళ్లీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

–మారుతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్ నిజామాబాద్

సిద్ధులగుట్టపై చిరుత ఉందా? లేదా?



వైరల్ అవుతున్న వీడియోలోని చిరుత పులి దృశ్యం



సిద్ధుల గుట్టపై చిరుతపులి కనిపించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు(ఫైల్)

- ఆరు రోజులు గడిచినా సీసీ కెమెరాకు చిక్కని చిరుత పులి కదలికలు
- మరో వీడియో వైరల్ కావడంతో భయాందోళనలో ఆర్మూర్ ప్రజలు

ఆర్మూర్‌టౌన్: ఆరురోజుల క్రితం ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై చిరుత సంచారం కలకలం రేపింది. కాగా చిరుత నక్కిన గుహ ప్రాంతంలో, నీటి వనరులు ఉన్న ప్రాంతంలో దాని కదలికలను గుర్తించడానికి అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు సీసీ కెమెరాలో చిరుత కదలికలు నిక్షిప్తం కాలేదు. ఇతర పశువులు, కోతులు సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాలో అధికారులు గుర్తించారు. ఆరు రోజులు గడుస్తున్న చిరుత జాడ తెలియడం లేదు. భక్తులు చూస్తుండగా గుహలోకి వెళ్లిన చిరుత ఇప్పటి వరకు బయటకు రాలేదు. ఆరు రోజులైన ఆహారం కోసం, దప్పిక తీర్చుకోవాడానికి చిరుత బయటకు వస్తలేదంటే ఇక్కడ ఉన్నట్లా? లేదా మరో ప్రాంతానికి వెళ్లిపోయిందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా ఇతర ప్రాంతంలో అటవీశాఖ అధికారులు చిరుతను పట్టుకున్నప్పుడు తీసిన వీడియో ఆర్మూర్ పట్టణంలో వైరల్ అవుతుండంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో సిద్దుల గుట్టపై ఎక్కాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుత సంచారంపై పక్కా సమాచారం తెలపాలని, చిరుతపులి ఉంటే పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళనకు గురికావద్దు..



ఆర్మూర్ పట్టణంలో వైరల్ అవుతున్న చిరుత ఫేక్ వీడియోతో ప్రజలు ఆందోళనకు గురికావద్దు. చిరుతను పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఇప్పటి వరకు ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. అలాగే చిరుత అడుగులు సైతం కనబడలేదు. ప్రజలు భయపడవద్దు.

–శ్రీనివాస్, ఫారెస్ట్ రెంజ్ అధికారి, ఆర్మూర్

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి



ట్రాక్టర్ కింద రాజు మృత దేహం

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామ శివారులో నవాబు లిఫ్ట్ కాలువలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి అదే గ్రామానికి చెందిన గొరుమెంత రాజు(38) రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా.. రాజు వ్యవసాయంతో పాటు గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో గొర్రెలకు మేత తీసుకరావడానికి తన స్నేహితుడు నరేష్‌కు చెందిన ట్రాక్టర్‌ను తీసుకొని వెళ్లాడు. గ్రామ శివారులోని కాలువలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మాదాపూర్‌లో గుడిసె దగ్ధం



మాక్లూర్: మండలంలోని మాదాపూర్‌లో కేడం రమేష్‌కు చెందిన పూరి గుడిసె ఎండ తీవ్రతకు దగ్ధం అయినట్టు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీ శనివారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం కుటుంబీకులు ఇంట్లో నిద్రిస్తుండగానే అకస్మాత్తుగా మంటలు లేసి గుడిసె దగ్ధం అయినట్టు బాధితులు తెలిపారన్నారు. గుడిసెలో ఉన్న వంట సామగ్రి, దుస్తులు కాలి బూడిదైనట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పంచనామా నిర్వహించగా అరతులం పుస్తెల తాడు, అరతులం వెండి పట్ట గొలుసులు గుడిసెలోనే దగ్ధం అయినట్టు తెలిపారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నరేష్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. కందర్‌పల్లికి చెందిన రేణుకకు ఇద్దరు మగ పిల్లలు, ఒక పాప పుట్టగా అనారోగ్యంతో మగ పిల్లలు మృతిచెందారు. ఈవిషయమై దంపతుల మధ్య తరచు గొడవలు జరిగేవి. భర్త వేధింపులు, గొడవలు భరించక రేణుక గురువారం అర్ధరాత్రి ఇంటిలోని దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సంఘమేశ్వర్‌లో రైతు..

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పంతులుగారి పెంటయ్య(26)కు గ్రామ శివారులో రెండు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. దీంట్లో ఎకరం పొలం వేయగా, మిగతా బీడుభూమిగా ఉంది. వ్యవసాయ సాగుకోసం వీటిలో గత ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు పది బోర్లు వేశాడు. కానీ నీళ్ల పడకపోగా అప్పుల పాలయ్యాడు. పది బోర్లకు దాదాపుగా రూ. 8లక్షల వరకు అప్పు అయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాలయ్య గతంలో మరణించగా, తల్లి మణెవ్వ, సోదరుడు శేఖర్‌తో కలిసి ఉంటున్నాడు. వ్యవసాయ పనులకు తోడు ట్రాక్టర్ పనులు చేస్తూ ఇంటికి అండగా ఉన్నాడు. పెంటయ్య మృతితో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయినట్లయింది. తల్లి మణెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

పెద్దమల్లారెడ్డిలో యువకుడు..



ప్రవీణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మర్రి ప్రవీణ్ (24) కూలీ పని చేస్తూ తాగుడుకు బానిసయ్యాడు. తరచు మద్యం తాగేందుకు ఇంట్లో వారిని డబ్బులు అడిగేవాడు. శుక్రవారం రాత్రి ప్రవీణ్ మద్యం తాగేందుకు తండ్రిని డబ్బు అడుగగా ఆయన ఇవ్వకపోవడంతో తీవ్రమనస్తాపం చెందాడు. ఈక్రమంలో ఇంట్లోని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

గోలిలింగాలలో ఒకరు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోలిలింగాలలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గోలిలింగాల గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన పిట్ల నర్సింలు(30) తన చెల్లెలు భవానిని నాలుగేళ్ల క్రితం మెదక్ జిల్లా హవేలీ ఘణపూర్ గ్రామానికి చెందిన దయానంద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా కట్నం కింద ఏడున్నర తులాల బంగారం ఇస్తామని ఒప్పుకోగా ఐదున్నర తులాలు ఇచ్చారు. మరో రెండు తులాల బంగారం కోసం అత్తింటివారు ఆమెను వేధించేవారు. ఈక్రమంలో చెల్లికి ఇవ్వాల్సిన బంగారం ఇవ్వలేకపోవడంతోపాటు ఇతర అప్పులు తీర్చలేక నర్సింలు తీవ్రఆవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో తన చెల్లిని అత్తింటివారు వేధిస్తున్నారని పేర్కొంటూ నర్సింలు సూసైడ్‌నోట్ రాసి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.



పిట్ల నర్సింలు(ఫైల్)

రాజరాజేశ్వరీనగర్‌లో వివాహిత..

కమ్మర్‌పల్లి: మండలంలోని రాజరాజేశ్వరీనగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. రాజరాజేశ్వరీనగర్ గ్రామానికి చెందిన బోదాసు లక్ష్మి(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా, ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్తాపం చెందింది. ఈక్రమంలో శనివారం ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కొడుకు బోదాసు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంతూరికి చేరిన గల్ఫ్ బాధితుడు

- ఏజెంట్ల చేతిలో మోసపోయి, మలేషియాలో ఏడాదిగా నరకయాతన
- నాయకుల చొరవతో క్షేమంగా ఇంటికి..

మోర్తాడ్(బాల్కొండ): ఏజెంట్ల చేతిలో మోసపోయి, ఏడాది కాలంగా మలేషియాలో నరకయాతన అనుభవించిన ఏర్గట్ల వాసి ఒకరు నాయకుల చొరవతో క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. వివరాలు ఇలా.. ఏర్గట్లకు చెందిన లింగారెడ్డి ఉపాధి కోసం కువైట్ వెళ్లడానికి జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్‌కు చెందిన ఏజెంట్‌ను ఆశ్రయించాడు. కువైట్ కంటే మలేషియాలో మంచి పనులు ఉన్నాయని నమ్మించిన ఏజెంట్ అతడి వద్ద రూ.90వేలు వసూలు చేశాడు. వారం రోజుల విజిట్ వీసాను లింగారెడ్డి చేతిలో పెట్టి మలేషియా వెళ్లిన తరువాత వర్క్ వీసాను తమ ఏజెంట్లు ఇప్పిస్తారని అతడిని నమ్మించాడు. తీరా మలేషియా వెళ్లిన తరువాత అక్కడ ఉన్న బ్రోకర్లు లింగారెడ్డి వద్ద నుంచి మరో రూ.50వేలు వసూలు చేసి, చేతులెత్తేశారు. దీంతో పని కోసం వెతుకుతున్న తరుణంలో బస్సు ప్రమాదానికి గురైన అతడి కాలు విరిగింది. విజిట్ వీసా గడువు ముగిసిపోవడంతో అతను చట్టవిరుద్ధంగా ఉండాల్సి వచ్చింది. ఇక్కడి గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు చాంద్‌పాషా, కాంగ్రెస్ నాయకులు శివన్నోళ్ల శివకుమార్, శివన్నోళ్ల రాజులు స్పందించి లింగారెడ్డికి విదేశాంగ శాఖ ద్వారా సహకారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో లింగారెడ్డి విషయంలో మలేషియాలో ఉన్న మన రాయబార కార్యాలయం అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు. లింగారెడ్డి చేతిలో నయాపైసా లేకపోవడంతో అతను మలేషియా నుంచి ఇంటికి చేరుకోవడానికి అవసరమైన విమాన టిక్కెట్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి కొనుగోలు చేసి ఇచ్చారు. దీంతో బాధితుడు రెండు రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. ఏజెంట్లు మోసం చేసినా మానవతా దృక్పథంతో తనను ఇంటికి చేర్పించిన నాయకులకు లింగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



మలేషియా నుంచి ఇంటికి చేరిన బాధితుడు లింగారెడ్డితో గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు చాంద్‌పాషా

పోలీసులమని చెప్పి బంగారం చోరీ

డిచ్‌పల్లి: పోలీసుల పేరు చెప్పి మాయమాటలతో వృద్ధుడిని మోసం చేసి అతడి వద్ద ఉన్న తులంన్నర బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన మండలంలో కలకలం రేపింది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం రూప్లానాయక్ తండాకు చెందిన ఇత్యానాయక్ శుక్రవారం తన మనవడితో కలిసి బైక్‌పై నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి బయలుదేరాడు. డిచ్‌పల్లి మండలం మాధవనగర్ బైపాస్ రోడ్డు వద్దకు రాగానే వెనక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అతడి బైక్‌ను అడ్డుకుని నిలిపివేయించారు. తాము పోలీసులమని, కొద్దిసేపటి క్రితం కంఠేశ్వర్ వద్ద బంగారం చోరీ జరిగిందని, అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నీ మెడలో ఉన్న బంగారు గొలుసు (తులం), చేతి వేలికి ఉన్న బంగారు ఉంగరం (అరతులం) తీసి కవర్‌లో పెట్టుకోవాలని వృద్ధుడికి సూచించారు. దీంతో ఇత్యానాయక్ వారి చేతికి బంగారు గొలుసు, ఉంగరం ఇచ్చాడు. వారు తమ వద్ద ఉన్న కవర్‌లో గొలుసు, ఉంగరాన్ని ఉంచి కర్చీఫ్‌తో ముడివేసి ఇత్యానాయక్‌కు ఇచ్చారు. అనంతరం ఇత్యానాయక్ అక్కడి నుంచి బయలుదేరి, ఇంటికి చేరుకున్నాడు. కొద్దిసేపటికి కవర్‌లో చూడగా అందులో డూప్లికేట్ గొలుసు, ఉంగరం ఉండటం గమనించి ఆందోళనకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులకు తెలియజేయగా వారు డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. ఎవరైనా మాయమాటలు చెబితే నమ్మవద్దని పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

ఆరేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారం!

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో ఆరేళ్ల బాలికపై 65ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా.. మూడు రోజుల క్రితం వృద్ధుడు బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు తెలిసింది. శుక్రవారం బాలిక కుటుంబసభ్యులకు విషయం తెలియడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.